

చీనీ టన్ను రూ.22,050

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,050, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.11,500 ప్రకారం ధర పలికాయి.



క్వింటా చింతపండు రూ.30 వేలు

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటా చింతపండు (కరిపులి) గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.8,150 వేల ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.4°/13.1°

జిల్లా వ్యాప్తంగా సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయికి ఏపీఎంఎస్ విద్యార్థుల 'ఆవిష్కరణ'



జాతీయ స్థాయికి ఎంపికైన ఆవిష్కరణను చూపుతున్న ఏపీఎంఎస్ విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: పాఠశాల విద్యార్థులను భవిష్యత్తులో ఆవిష్కర్తలుగా, వ్యవస్థాపకులుగా మార్చడంలో భాగంగా ఏర్పాటు చేసిన 'మేడ్ ఇన్ 3డీ – సీడ్ ది ఫ్యూచర్ ఎంటర్‌ప్రెన్యూర్స్'కు ధర్మవరంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక సమస్యలు గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు చూపించే ప్రయత్నం చేసిన విద్యార్థులను డీఈఓ కృష్ణప్ప సోమవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో వంద పాఠశాల విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. 5 ఆవిష్కరణలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో చేనేత పరిశ్రమకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపుతూ ధర్మవరం ఏపీమోడల్ స్కూల్ గైడ్ టీచర్ శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులు సుజయ్, హేమంత్‌కుమార్, లాస్య, జ్యోతి, గుణశ్రీ, మేఘన రూపొందించిన ఆవిష్కరణ ఉండడం విశేషం.

ఆర్డీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

ప్రశాంతి నిలయం: రీ సర్వే పనుల పర్యవేక్షణకు ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ, డివిజనల్ రెవెన్యూ అధికారుల లాగిన్‌లలో లక్షకుపైగా రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ నెల 28లోగా ధ్రువీకరించాలని ఆదేశించారు. భూముల ఫ్రీ హోల్డ్ సంబంధించిన అంశాలను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎం ఈ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి కష్టం

- జిల్లాలో తాగునీటికి కటకట
- అడుగంటిన భూగర్భ జలాలు
- వేసవికి ముందే మొదలైన కష్టాలు
- పుట్టపర్తి, హిందూపురంలో అవస్థలు
- రానున్న రోజుల్లో తీవ్రం కానున్న సమస్య
- చాలా చోట్ల నీళ్లు కొని తాగాల్సిన పరిస్థితి





ఇది హిందూపురం పట్టణంలోని నానెప్పనగర్‌లోని చిత్రం. నీటి సరఫరా నిలిచిపోవడంతో ఓ ఇంటివారు ఇలా ప్రైవేటు ట్యాంకరు ద్వారా నీటిని తెప్పించుకుని సంపులను నింపుకుంటున్నారు. పట్టణంలో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మడకశిర పంచాయతీ పరిధిలోని పావగడ రోడ్డులో నివాసం ఉన్న ప్రజలు గత నెల రోజు తాగునీటి కోసం రోడ్డెక్కి నిరసన తెలిపారు. 15 రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



హిందూపురం టౌన్: వేసవికి ముందే జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలమట్టం భారీగా పడిపోవడంతో జిల్లా వ్యాప్తంగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. మడకశిర, హిందూపురం మొదలుకుని పుట్టపర్తి, ఓడీ చెరువు వరకు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా.. బిందెలు చేతబట్టుకుని పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్తున్న మహిళలే కనిపిస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం కాగా, జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు..

జిల్లాలో వేసవి తాపం మొదలైంది. ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు భగభగ మండుతుండగా.. భూగర్భంలోని జలం ఆవిరయిపోతోంది. ఈక్రమంలో గతేడాది వర్షాకాలంలో 8 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలం.. ప్రస్తుతం 12.9 మీటర్ల లోతుకి పడిపోయింది. ఫలితంగా బోరుబావులు ఎండిపోయాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు మరింత అధికమయ్యే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముందస్తుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాల్సిన గ్రామీణ నీటిపారుదలశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఆ దిశగా నేటికీ చర్యలు చేపట్టలేదు. ఫలితంగా చాలా గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

'పురం'లో తీవ్ర నీటి ఎద్దడి..

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో హిందూపురం ఒకటి. వేసవి ఆరంభమైతే పురం గొంతు తడారి పోతుంది. చుక్కనీటి కోసం జనం పడరానిపాట్లు పడతారు. ప్రస్తుతం చాలా కాలనీల్లో నీటి సమస్య ఏర్పడింది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు సరిగా రాకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. పట్టణంలోని మోడల్ కాలనీ, రహమత్‌పురం, సీపీఐ కాలనీ, నానెప్పనగర్, లక్ష్మీపురం, డీబీ కాలనీ, డీఆర్ కాలనీ తదితర ప్రాంతాల వారికి నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

12.9 మీటర్లు	జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలమట్టం
42	వాల్టా చట్టం పరిధిలోని గ్రామాలు
284	సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద ఆర్‌డబ్ల్యూఎస్ చేపట్టిన పనులు
42 రెడ్‌జోన్‌లో ఉన్న గ్రామాలు	రూ.5.12 కోట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా కేటాయించిన నిధులు

ప్రైవేటు ట్యాంకర్లే దిక్కు..

నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో హిందూపురంలోని పలు ప్రాంతాల్లోని జనం ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడ్డారు. రోజూ డబ్బులు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. హిందూపురంలో ఒక కుటుంబంపై నీటికోసమే నెలకు రూ.2 వేలకు పైగా అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రానున్న రోజుల్లో సమస్య మరింత తీవ్రం కానుందని, ఆలోపు తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్ రూ.500..

జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి తలెత్తడంతో 42 గ్రామాలు డేంజర్ జోన్‌లో ఉన్నట్లు గ్రామీణ నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఇంతవరకూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ప్రారంభించలేదు. దీంతో తాగునీటి ఇబ్బందులున్న ప్రాంతాల్లోని వారు నెలకు రూ.2 వేలపైనే ఖర్చు చేస్తున్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు



మా కాలనీకి నీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోజువారీ పనులకు నీరు ఉండటం లేదు. తాగునీటితో పాటు ఇతర అవసరాలకు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.
– షాహీన, మోడల్ కాలనీ, హిందూపురం

వేసవి వచ్చిందంటే అంతే



వేసవి వస్తే నీటి కోసం మేము పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. మా ప్రాంతంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. కొళాయిల్లో నీటిని సరిగా వదలడం లేదు. వదిలినా 10 రోజులకోసారి. నీళ్లు వచ్చినప్పుడు పనులన్నీ మానుకుని పట్టుకుంటున్నాం.
– కతిజాబాను, మోడల్ కాలనీ, హిందూపురం

సమస్య చెబితే పరిష్కరిస్తాం

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ నీటి సరఫరా పథకం కింద జిల్లా వ్యాప్తంగా రూ.5.12 కోట్లతో 284 పనులు చేపట్టాం. ఏ గ్రామంలో సమస్య ఉన్నా.. వెంటనే తెలియజేస్తే.. పరిష్కార మార్గం చూపిస్తాం.
– మల్లికార్జునప్ప, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారి

రెడ్డప్పశెట్టికి బిగుస్తున్న ఉచ్చు

- ఆక్రమణలపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- స్థానిక అధికారులను వివరణ కోరిన కలెక్టర్ చేతన్..!

సాక్షి ఎఫెక్ట్..



బ్రిడ్జి తొలగించాలని జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన నోటీసు

చిలమత్తూరు: చిత్రావతి నదిని చెరబట్టి ఏకంగా అక్రమంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన రియల్టర్ రెడ్డప్పశెట్టికి ఉచ్చుబిగుసుకుంటోంది. కోడూరు, కొడికొండ గ్రామాల్లో రెడ్డెప్పశెట్టి ఆక్రమణలు, చిత్రావతి నదిపై అనధికార బ్రిడ్జి నిర్మాణం, రైతులపై వేధింపులపై 'సాక్షి' ప్రచురించిన కథనాలపై రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం కదిలింది. క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతూ నివేదిక చేస్తోంది. ఒకరిద్దరు అధికారులు రెడ్డెప్పశెట్టి ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి సహకరిస్తున్నా... ఉన్నతస్థాయి అధికారుల కన్ను ఉండటంతో ప్రతిదీ పరిశీలించి మరీ నివేదిక సిద్ధం చేస్తున్నారు. మరోవైపు రెడ్డెప్పశెట్టి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ చేతన్ ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం అక్రమమని, వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. మరోవైపు కంచె వ్యవహారంలో ప్లానింగ్ రోడ్డు మూసివేసినట్టుగా ప్రాథమికంగా నిర్ధారించారు. వీటిపై వివరణ ఇవ్వాలని బెంగళూరులో ఉన్న రెడ్డెప్పశెట్టికి నోటీసును పోస్ట్ ద్వారా పంపినట్లు అధికారులు తెలిపారు.

రైతులతో తప్పుడు స్టేట్‌మెంట్

ఓ రెవెన్యూ అధికారి తప్పుడు స్టేట్‌మెంట్ తయారు చేసి రైతులతో సంతకాలు చేయించేందుకు ఎత్తుగడ వేయడం సంచలనం కలిగిస్తోంది. సోమవారం విచారణకు వెళ్లిన రెవెన్యూ అధికారుల్లో ఒకరు...రైతులు చెప్పని విషయాలు నివేదికలో పొందుపర్చేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం రైతులను బలవంతంగా తన కార్యాలయానికి పిలిపించి ఒత్తిడి చేసినా...వాళ్లు ససేమిరా అనడంతో ఆయన ప్లాన్ బెడిసి కొట్టింది.

తహసీల్దార్ ఓవర్ యాక్షన్..

రెడ్డెప్పశెట్టి వ్యవహారంలో 'సాక్షి'లో వచ్చిన కథనాల ఆధారంగా సాగుతున్న విచారణ గురించి తహసీల్దార్ వెంకటేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా... ఆయన దురుసుగా ప్రవర్తించారు. ఏదైనా డీటీ లేదా సీనియర్ అసిస్టెంట్‌ను అడగాలని, తాను బిజీగా ఉన్నానంటూ ఫోన్ కట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అందుబాటులో ఉండని ఆయన్ను ఎవరైనా ప్రశ్నిస్తే తాను మూడు మండలాలు చూసుకుంటున్నానని, చిలమత్తూరులో ఉంటే కుదరదంటూ దురుసుగా సమాధానం ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కమనీయం.. గౌరీశంకరుల కల్యాణం

- పూర్ణాహుతితో నేడు ముగియనున్న అతిరుద్ర యజ్ఞం



గౌరీ శంకరుల కల్యాణ ఘట్టం



అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రశాంతి నిలయం: వేద పండితుల మంత్రోచ్చారణలు... భక్తుల జయజయధ్వానాల మధ్య గౌరీశంకరుల కల్యాణం కమనీయంగా సాగింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం సోమవారమూ కొనసాగింది. ఉదయం వేదపండితులు యజ్ఞ క్రతువులను నిర్వహించారు. సాయంత్రం గౌరీశంకరుల కల్యాణం జరిపించారు. అనంతరం సాయి కార్తీక్ జ్ఞానేశ్వర్ బృందం సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కాగా, అతిరుద్ర మహాయజ్ఞం మంగళవారం పూర్ణాహుతితో ముగియనుంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ చేతన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన దివ్యాంగుడిని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించబోనని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులకు హెచ్చరించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 233 అర్జీలను అందగా, వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజలు ఎంతో ఆశతో జిల్లా కేంద్రం వరకూ వచ్చి తమ సమస్యపై అర్జీలు ఇస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అర్జీలు సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించే క్రమంలో ఉన్నతాధికారి కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అందే ఫీడ్ బ్యాక్‌కు ఆయా శాఖల ఉన్నతాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక నివేదికలు వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు జీఎస్‌డబ్ల్యూఎస్, పీ–4 సర్వేను పర్యవేక్షించాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతన్... అర్జీలు ఇచ్చుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పట్టు పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, హౌసింగ్ పీడీ వెంకట రమణ, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, జిల్లా క్రీడల శాఖ అధికారి ఉదయ్‌కుమార్, గ్రామ/ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రజినికి జాతీయ అవార్డు



జాతీయ అవార్డు అందుకుంటున్న రజిని

మడకశిర రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆమిదాలగొందికి చెందిన రజినికి జాతీయ అవార్డు దక్కింది. ఆదివారం నాగపూర్‌లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రజినికి కేంద్ర ప్రభుత్వంలోని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు అవార్డు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేయడంతో పాటు తన తోటి రైతులనూ ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించిన రజిని కృషి అమోఘమని కొనియాడారు. కాగా జాతీయ అవార్డుతో జిల్లాకు పేరు తెచ్చిన రజినిని జిల్లా ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, మడకశిర డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యురాలు కీర్తన, యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, సిబ్బంది అభినందించారు.

భయంతోనే ప్రతిపక్ష హోదా నిరాకరణ

- 40 శాతం ఓటు బ్యాంకు ఉన్న పార్టీకి విలువలేదా?
- స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు స్పందించకపోవడం బాధాకరం
- ప్రజాగ్రహంతో 'కూటమి' కుప్పకూలడం ఖాయం
- విలేకరులతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: ''కుట్రలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అసెంబ్లీ నిబంధనలు పాటించడం లేదు. 40 శాతం ఓటు బ్యాంకు సాధించిన వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తోంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ కూడా దీనిపై స్పందించకపోవడం దారుణం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అగౌరవపర్చాలని కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు. కానీ ప్రజలు అప్రజాస్వామ్య చర్యలన్నీ గమనిస్తున్నారు. ప్రజాగ్రహం ముందు ఎవరైనా తలవంచాల్సిందే. కూటమి సర్కార్ కూడా కూలడం ఖాయం'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఆ పార్టీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం ఆమె పరిగిలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి ప్రజా సమస్యలను చర్చించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లారన్నారు. కానీ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా... ప్రతిపక్ష హోదాను కల్పించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా ఇచ్చే అంశంపై నివేదిక ఇవ్వాలని స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను హైకోర్టు ఆదేశించినప్పటికీ వారు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తే తమ బండారం బయటపడుతుందన్న భయంతోనే కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇది ఎల్లకాలం జరగదన్న విషయం కూటమి నాయకులు గుర్తెరగాలన్నారు. సంక్షేమ పథకాలివ్వకుండా మాటలకే పరిమితమవుతున్న చంద్రబాబుకు జనమే బుద్ధిచెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

300 వక్కచెట్లు దగ్ధం



రొళ్ల: మండలంలోని ఆర్.గొల్లహట్టిలో రైతు గద్దె తిమ్మప్ప తనకున్న 1.5 ఎకరాల్లో సాగు చేసిన వక్కతోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో 300 వక్క చెట్లు, 15 కొబ్బరి చెట్లు కాలిపోయాయి. తోటకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోని ఎండు గడ్డికి సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి తోటను చుట్టుముట్టాయి. పంట సాగు చేసి దాదాపు ఐదేళ్లు కావస్తోంది. ప్రస్తుతం కొన్ని చెట్లు కాపునకు వచ్చాయి. దీంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ఆర్డీటీ బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత ధర్మవరం



ప్రతిభ చాటిన క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఆర్డీటీ బాస్కెట్‌బాల్ టోర్నీ విజేతగా ధర్మవరం జట్టు నిలిచింది. ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురంలోని ఇండోర్ స్టేడియం వేదికగా ఈ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో ప్రాతినిధ్యం వహించిన ధర్మవరం బాలికలు, బాలుర జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్–15 విభాగం ఫైనల్స్‌కు బుక్కరాయసముద్రం బాల, బాలికల జట్లు చేరుకోగా, ధర్మవరానికి చెందిన బాల, బాలికల జట్లు తలపడి టోర్నీ విజేతగా నిలిచాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడిజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, పీఈటీలు రమేష్‌బాబు, నాగేంద్ర తదితరులు అభినందించారు.

గుండె సంబంధిత సమస్యతో విద్యార్థిని మృతి




వర్ష (ఫైల్)

సోమందేపల్లి: గుండె సంబంధిత సమస్యతో ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు... సోమందేపల్లికి చెందిన పురుషోత్తం కుమార్తె వర్ష (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఐదు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ధర్మవరం, అనంతపురంలోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి బాలిక మృతిచెందింది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ వర్ష మృతి చెందినట్లు చికిత్స అందజేసిన కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. ఏకైక కుమార్తె మృతితో తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా పోయింది. సోమవారం సాయంత్రం చిన్నారి అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించారు.

మతిపోతోంది

- పెరుగుతున్న మానసిక రుగ్మత బాధితులు
- ఉమ్మడి జిల్లాలో 15 వేల మంది రోగులు
- లక్ష మంది ఏదో ఒక ఆందోళనతో సతమతమవుతున్నట్లు వెల్లడి
- ఇప్పటికే మధుమేహం, రక్తపోటుతో జనం ఇబ్బందులు
- ప్రతిబంధకాలుగా మారిన మొబైల్ ఫోన్‌లు

- అనంతపురం నగరంలో బీకాం చదువుతున్న ఓ యువకుడికి వారం రోజుల క్రితం మతి మరుపు సమస్య వచ్చింది. తల్లిదండ్రులు అతడిని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లగా.. తీవ్ర మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. మొబైల్ ఫోన్‌కు బానిసై అన్నీ మరచిపోయాడని తెలిపారు.
- ఇటీవల గుంతకల్లుకు చెందిన ఓ యువతి మూడు దఫాలు ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వైద్యుడి వద్దకు ఆమెను తీసుకెళ్లగా.. మానసికంగా కుంగిపోయి ఉందని ఆయన తెలిపారు. చదువులో ఒత్తిడి భరించలేక ఇలా అయిందని చెప్పారు. వీరిద్దరే కాదు.. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఇటీవల భారీగా పెరిగింది.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి అనంతపురం జిల్లా జబ్బులకు అడ్డాగా మారుతున్నట్టు వైద్యుల పరిశీలనలో వెల్లడవుతోంది. ఇప్పటికే మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. తాజాగా మూడో యముడు అన్నట్టు మానసిక రుగ్మతలు తీవ్రంగా వేధిస్తున్నాయి. దశాబ్దం క్రితం వరకూ పట్టణాలకే పరిమితమైన మానసిక రుగ్మతలు పల్లెటూళ్లకూ పాకాయి. దీంతో ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. గడిచిన కొన్ని నెలలుగా వివిధ ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ హెల్త్ మిషన్) అధికారులు చేపట్టిన పరిశీలనలో విస్మయం కలిగించే విషయాలు వెల్లడయ్యాయి.

15 వేల మంది బాధితులు..

బీపీ, మధుమేహం కంటే కూడా మానసిక రుగ్మతను తీవ్ర ప్రమాదంగా పరిగణిస్తారు. అలాంటి తీవ్ర మానసిక రుగ్మత బాధితులు జిల్లాలో 15 వేల మంది ఉన్నట్టు అంచనా. మరో లక్ష మంది వరకూ సాధారణ, మోస్తరు మానసిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభావం తక్కువగా ఉన్నప్పుడే కౌన్సెలింగ్ లేదా మందులు ఇప్పిస్తే తీవ్ర రుగ్మతగా మారే అవకాశం ఉండదు. కానీ బాధితులకు అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి ముదిరే వరకూ వైద్యులను సంప్రదించకపోవడం గమనార్హం.

15 వేల మందికి మందులే లేవు..

గతంలో ఆరోగ్య సురక్ష, ఏఎన్‌ఎంల ఇంటింటి సర్వే, 104 వాహనాల్లో పరీక్షలు తదితర చర్యల వల్ల బాధితులను వేగంగా గుర్తించేవారు. అలాంటి వారికి ఇంటి వద్దే ఉచితంగా ప్రభుత్వమే మందులిచ్చేది. అయితే, గత ఆరు మాసాల నుంచి మెంటల్ హెల్త్ పేషెంట్లకు ఒక్క మాత్ర కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని బాధితులు మందులు వాడక, జబ్బు ముదిరి పూర్తి మానసిక వైకల్యానికి గురవుతున్నారు.

రుగ్మతలకు కారణాలివే..

- మితిమీరిన ఒత్తిడి కారణంగా చాలామంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారు.
- మొబైల్ ఫోన్‌లకు బానిస కావడంతో ప్రపంచమే ఇదే అనుకుని దాని మత్తులోకి వెళ్లిపోతున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో వస్తున్న రకరకాల రీల్స్, న్యూస్ చూస్తూ తమలో తామే ఊహించుకుని మానసిక రోగాలకు గురవుతున్నారు.
- కొంతమంది విద్యార్థులు చదువులో ఒత్తిడి కారణంగా డిప్రెషన్‌లోకి జారుకుంటున్నారు.
- రకరకాల బెట్టింగ్‌లు, ఆర్థిక కారణాలతో తీవ్ర మానసిక రోగానికి గురవుతున్నారు.
- ఇటీవల కాలంలో లోన్‌యాప్‌ల ఒత్తిళ్లతో మానసిక స్థైర్యం కోల్పోతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల మానసిక రుగ్మతల బాధితులు..

కేటగిరీ	బాధితులు
మొత్తం రోగులు	1.10 లక్షలు
స్కిజోఫినియా, బైపోలార్	10 శాతం
డ్రగ్, ఆల్కహాల్ అడిక్షన్‌తో కూడిన మానసిక రుగ్మతలు	30 శాతం
డిప్రెషన్, యాంగ్జైటీ రుగ్మత	40 శాతం
మొబైల్..చదువుల ఒత్తిళ్లతో	10 శాతం

చాలామందిలో అవగాహన లేదు

వ్యాధి ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడు గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. కానీ చాలామందిలో అవగాహన లేక జబ్బు ముదిరే వరకూ రావడం లేదు. ఇటీవలి కాలంలో ఆల్కహాల్, డ్రగ్ అడిక్షన్ కారణంగా మానసిక బాధితులు ఎక్కువవుతున్నారు.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, ఎన్‌హెచ్‌ఎం

ఏపీ రైతు సంఘం నేత బడా సుబ్బిరెడ్డి కన్నుమూత





నివాళులర్పిస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వ, తదితరులు (ఇన్‌సెట్) బడా సుబ్బిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దక్షిణ జిల్లా కార్యదర్శి, సీపీఎం నాయకులు బడా సుబ్బిరెడ్డి(65) ఆదివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి ఆయన కన్నుమూశారు. కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆయన సుదీర్ఘకాలంగా రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించారు. సోమవారం ఉదయం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నేత ఓబులు తదితరులు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, అత్తార్ చాంద్ బాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, వ్యకాసం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు, నాయకులు జగన్, సాంబశివ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బాబ్జాన్‌తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు... సుబ్బిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతాంగ సమస్యలపై ఆయన సాగించిన అలుపెరగని పోరాటాలను ఈ సందర్భంగా నేతలు గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరిగిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

హేమావతి క్షేత్రంలో రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



పురాతన సిద్దేశ్వర స్వామి ఆలయ గర్భగుడి

అమరాపురం: దక్షిణ భారతదేశంలోనే అత్యంత పురాతన శైవక్షేత్రంగా ఖ్యాతిగాంచిన అమరాపురం మండలం హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామస్తుల సహకారంతో దేవదాయ శాఖ అధికారులు పూర్తి చేశారు. ఉత్సవాల షెడ్యూల్‌ను దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 26న బుధవారం మహాశివరాత్రి అఖండ పూజలు, రుద్రాభిషేకం, భజనలు, 27న గురువారం భాను పల్లకి, ధూళోత్సవం, అన్నసంతర్పణ, 28న శుక్రవారం అగ్నిగుండం, ముత్యాలపల్లకి ఉత్సవం, వివిధ రకాల పూలమాలలతో స్వామి మూల విరాట్‌కు అలంకరణ, మార్చి 1న శనివారం సాయంత్రం సిడిమాను ఉత్సవం, అన్నసంతర్పణ, రాత్రికి ముత్యాలపల్లకి ఉత్సవం, 2న ఆదివారం సిద్ధేశ్వరస్వామి చిన్నరథోత్సవం, రాత్రి ముత్యాల పల్లకి ఉత్సవం, 3న సోమవారం బ్రహ్మరథోత్సవం, అన్నసంతర్పణ, 4న మంగళవారం వసంతోత్సవం, 5న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

రైతులు ఎలా బతకాలి?

- సాగు భూముల్లో సోలార్ ప్లాంటా..?
- పాడి పశువులు, జీవాలకు మేత ఎలా?
- న్యాయం జరిగేలా చూడాలని వేడుకోలు
- భూసేకరణపై గ్రామసభలో అధికారులకు రైతుల వినతి



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న రైతులు

ఎన్పీకుంట: సాగు భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే తామెలా బతకాలి అంటూ రైతులు అధికారులను ప్రశ్నించారు. చుట్టూ సోలార్ ఏర్పాటు చేసుకుంటూ పోతే పంటలు ఎలా పండించాలి.. పాడి పశువులు, జీవాలకు మేత ఎలా సమకూర్చాలని నిలదీశారు. తమకు న్యాయం జరిగే వరకు భూ సేకరణ చేపట్టవద్దని స్పష్టం చేశారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి సోమవారం మరికొమ్మదిన్నె సచివాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించి రైతులతో అభిప్రాయాలు స్వీకరించారు. పంచాయతీ పరిధిలోని రైతులు హాజరై తమ అభ్యంతరాలను తెలియజేశారు. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం తీసుకోవడం దారుణమన్నారు. గతంలో భూముల సర్వే, హద్దుల ఏర్పాటు కోసం చాలా డబ్బు వెచ్చించామని, అయినా రెవెన్యూ అధికారులు రేపు, మాపు అంటూ కాలయాపన చేసి తమకు పట్టాలు మంజూరు చేయలేదని అన్నారు. మండలం చుట్టూ సోలార్ ప్లాంట్లు ఏర్పాటైతే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలో 10 వేలకు పైగా మూగజీవాలు ఉన్నాయని, 100 నుంచి 120 కుటుంబాలు పాడిపశువుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. పాడి రైతులు తమ పశువుల మేతకు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఈ విషయమై అధికారులు పునరాలోచించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేనంబరు 179–1లో సాగుకు అనుకూలం లేని 894 ఎకరాల ప్రభుత్వ భూమిని మాత్రమే సర్వే చేస్తున్నారని, అర్హులైన సాగు రైతులు తమ భూములకు సంబంధించిన ఏవైనా ఆధారాలు ఉంటే తమకు సమర్పించాలని కోరారు. రైతులు విన్నవించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. తమకు న్యాయం జరగకపోతే సోలార్ ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని, ఆందోళనలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు, మండల సర్వేయర్ జిలాని, రైతులు ఓబుళరెడ్డి, సుబ్బారెడ్డి, రంగారెడ్డి, ఇమామ్‌సాబ్, రాఘవరెడ్డి, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులే అన్యాయం చేశారు

- విలేకరుల ఎదుట వాపోయిన బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

పుట్టపర్తి టౌన్: రస్తా విషయంగా తనతో గొడవపడి మారణాయుధాలతో దాడి చేసిన వారిపై కాకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తనపైనే అక్రమంగా కేసు నమోదు చేశారంటూ డీఎస్పీ విజయ్‌కుమార్ ఎదుట ముదిగుబ్బ మండలం రాఘవపల్లికి చెందిన బాధిత దివ్యాంగుడు తిరుమలయ్య వాపోయాడు. ఈ మేరకు సోమవారం డీపీఓలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీఎస్పీకి వినతి పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాఘవపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 84, 64, 65, 66, 60లో తిరుమలయ్యతో పాటు పరశురాం, తిప్పయ్య, ధనుంజయతో పాటు మరికొందరికి 40 ఎకరాల పొలం ఉంది. ఇందులో నుంచి పక్క పొలానికి దారి వదలాలని వెంకటేష్, శివప్రసాద్, కుమార్, హరీష్, వెంకటనారాయణ, సంతోష్‌తో పాటు మరికొందరు రైతులు తరచూ తిరుమలయ్య కుటుంబీకులతో గొడవపడేవారు. ఈ వివాదం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఈ నెల 16న వికలాంగులని కూడా చూడకుండా తిరుమలయ్యపై మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఘటనపై ముదిగుబ్బ పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఐ శివరాముడు న్యాయం చేయకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తమపైనే కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారితో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ డీఎస్పీని కోరారు. స్పందించిన డీఎస్పీ విజయకుమార్... చట్ట పరిధిలో న్యాయం చేయాలని సీఐను ఫోన్ ద్వారా ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందజేసిన వినతుల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 58 వినతులు అందాయి. ఫిర్యాదులను డీఎస్పీ స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, పాటు సిబ్బంది పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ చేతన్‌కు వినతి పత్రం ఇస్తున్న 108 యూనియన్ నాయకులు

ప్రశాంతి నిలయం: ఎన్నికల సమయంలో 108 ఉద్యోగులకు ఇచ్చిన హామీలలో నేటికీ ఏ ఒక్కటి నెరవేర్చలేదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించి వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. 108 నిర్వహణను సర్వీస్ ప్రొవైడర్‌కు అప్పగించే చర్యలను ఖండించారు. దీని వల్ల ఈఎంటీ, పైలెట్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు వెంటనే 108 ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలు నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 108 యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జనరల్ సెక్రెటరీ ఓబులరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జరాయప్ప, ట్రెజరర్ అహమ్మద్ బాషా పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

రొద్దం: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... రొద్దం మండలం పి.రొప్పాల గ్రామానికి చెందిన ఉప్పర అంజినప్ప (55)కు భార్య వెంకటలక్ష్మమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. సోమవారం వ్యక్తిగత పనిపై కర్ణాటకలోని వెంకటాపురం గ్రామానికి వెళ్లిన ఆయన రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. చెరుకూరు గ్రామ సమీపంలోకి చేరుకోగానే మడకశిర–పెనుకొండ ప్రధాన రహదారిపై టింబక్ట్ కార్యాలయం వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనం దూసుకురావడంతో రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో ఉప్పర అంజినప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చెరుకూరుకు చెందిన చంద్రప్ప, ఈశ్వరమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. ఈశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పప్పుశనగ రైతులకు కుచ్చుటోపీ



ఎస్‌ఐ శివకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బెళుగుప్ప: పప్పుశనగ రైతులకు ఓ వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మశ్లెమల విక్రమ్‌కు పలు గ్రామాలకు చెందిన రైతులు పంటల దిగుబడులు ఇచ్చేవారు. తగ్గుపర్తి వద్ద శివసాయి వేర్‌హౌస్‌కు దిగుబడులను విక్రమ్ తరలించేవాడు. అయితే గత ఏడాది గుట్టు చప్పుడు కాకుండా పప్పుశనగ నిల్వలను తెగనమ్మిన విక్రమ్.. రైతులకు డబ్బు మాత్రం చెల్లించలేదు. దీనిపై అడిగితే అదిగో ఇదిగో అంటూ రైతులను మభ్యపెట్టేవాడు. ఈ క్రమంలోనే బెళుగుప్ప నుంచి తొలుత బళ్లారికి మకాం మార్చాడు. ఇటీవల బళ్లారి నుంచి కూడా పరారయ్యాడు. పంట దిగుబడులు ఇచ్చిన రైతులకు కోర్టు నోటీసులను పంపాడు. దీంతో 30 మంది విక్రమ్ బాధిత రైతులు సోమవారం పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐ శివకు ఫిర్యాదు చేశారు. తమకు సుమారు రూ.5 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని వాపోయారు. వేర్‌హౌస్ వద్దకు వెళ్లి ఆరా తీస్తే విక్రమ్ తన వాటాను అమ్ముకుని వెళ్లాడని చెప్పారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ శివ మాట్లాడుతూ పూర్తిస్థాయి విచారణ చేపట్టి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ జి.లక్ష్మీనారాయణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) డివిజనల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పటి వరకు డీఎంగా ఉన్న చంద్రమౌళీశ్వర్ రెడ్డిని ఏపీటీడీసీ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. సోమవారం కర్నూలులోని వెంకటరమణ కాలనీలో ఉన్న టూరిజం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపరిచి సందర్శకుల సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపడతామన్నారు. నూతన డీఎంకు ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ షా వలీఖాన్, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, ఆర్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగనాయకులు, ఏపీటీడీసీ కర్నూలు యూనిట్ మేనేజర్ సతీష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వీరభద్రుని సేవలో సజ్జనార్



వీరభద్రున్ని దర్శించుకుంటున్న సజ్జనార్ దంపతులు

లేపాక్షి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ సోమవారం లేపాక్షి వీరభద్రస్వామి సేవలో గడిపారు. తన భార్యతో కలిసి ఆలయానికి విచ్చేసిన సజ్జనార్‌కు ఆలయ అర్చకులు, అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు సజ్జనార్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించారు.

అన్నదాన సత్రం నిర్వహణకు సహకరిస్తా..

లేపాక్షి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న అన్నదానం సత్రం నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని సజ్జనార్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు కూడా సత్రంలో భోజనం చేసి వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఆయన సత్రంలో ఏర్పాటు చేసిన కాంస్య అన్నపూర్ణేశ్వరిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహణకు కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం పట్టణం అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సి.ఆంజనేయులు, స్థానిక ఎస్‌ఐ నరేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి శంకర్‌నాయక్ బహిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌పై ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం శంకర్ నాయక్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది.

పేదోడి రైళ్లు మరో వారం రోజులు తిరగవ్!

గుంతకల్లు: రాయలసీమ జిల్లాల మీదుగా ప్రయాణిస్తూ పేదోడి రైళ్లుగా పేరుగాంచిన పలు ప్యాసింజర్‌లు మరో వారం రోజులు తిరగవు. కుంభమేళాను పురస్కరించుకుని ఈ రైళ్లను ఫిబ్రవరి 28 వరకూ రద్దు చేశారు. తాజాగా మరో వారం పాటు పొడిగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి–కదిరిదేవరపల్లి (57406) ప్యాసింజర్ మార్చి 7 వరకు, కదిరిదేవరపల్లి–తిరుపతి (57405) ప్యాసింజర్ మార్చి 8 వరకు రాకపోకలు సాగించవన్నారు. అలాగే, గుంతకల్లు–తిరుపతి(57404) ప్యాసింజర్ మార్చి 7వరకు, తిరుపతి–గుంతకల్లు(57403) రైలు మార్చి 08 వరకూ, తిరుపతి–హుబ్లీ (57402) మార్చి 7 వరకు, హుబ్లీ–తిరుపతి(57401) ప్యాసింజర్ మార్చి 8 వరకు తిరగవన్నారు.

పలు రైళ్ల రద్దు.. కొన్ని దారి మళ్లింపు

గుంతకల్లు: పెనుకొండ–మక్కాజీపల్లి మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతోపాటు మరి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–హిందూపురం ప్యాసింజర్ రైలు (77213)ను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు, హిందూపురం–గుంతకల్లు ప్యాసింజర్(77214)ను ఈ నెల 26 నుంచి 28 వరకు రద్దు చేశారు. బెంగుళూరు–ధర్మవరం (06595/60) ప్యాసింజర్లు హిందూపురం–ధర్మవరం మధ్య ఈనెల 25 నుంచి 28 వరకు కేవలం బెంగుళూరు–హిందూపురం మధ్య రాకపోకలు సాగిస్తాయి. అహ్మదాబాద్–యశ్వంత్‌పూర్ (22689) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25న వయా ధర్మవరం–పెనుకొండ–హిందూపురం మధ్య మళ్లించారు. కలబురిగి–బెంగుళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22231)ను ఈ నెల 25 నుంచి 27 వరకు అనంతపురం, ధర్మవరం, పెనుగొండ, యలహంక మీదుగా, కాచిగూడ–యశ్వంత్‌పూర్ (20703)ను ఈ నెల 25 నుంచి 28 వరకు ధర్మవరం, ప్రశాంతి నిలయం, పెనుకొండ మీదుగా, హుబ్లీ–మైసూర్ (16591), కాచిగూడ–మైసూర్ (12785), నాంధేడ్–బెంగుళూరు (16594) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 26,27వ తేదీల్లో ధర్మవరం, ప్రశాంతి నిలయం, పెనుకొండ మీదుగా దారి మళ్లించారు.